



"ఒరేయ్ బాచిగా! ఎక్కడ చచ్చావురా?" పిలుపులో కోపం విసుగు

"వస్తున్నా పిన్నీ!" సమాధానంలో నమ్రత, వినయం

"పోన్లేపాపం తల్లితండ్రిలేని పిల్లాడివని దగ్గరకు దీస్తే అంత నిర్లక్ష్యమా? పిలిస్తే పలకవూ?" పిన్ని గర్జనకు ఉలికిపడి మరలా తమాయించుకుని ఎదురుగా నిలబడిపోయాడు పదేళ్ళ భాస్కర్.

"పొద్దుననగా మంచినీళ్ళయిపోతే ఏంచేస్తున్నావురా? పోయి వీధి కుళాయిలో నీళ్ళు పట్టుకురా"

"తెస్తాను పిన్నీ!" కడవ తీసుకుని వీధిలోకి పరుగెత్తాడు సభాస్కర్.

వీధి కుళాయి దగ్గర హోరాహోరీగా నేనుముందంటే నేనుముందని పోట్లాడుకుంటున్న ఇరుగు పొరుగు స్త్రీలు భాస్కర్‌ను చూచి తాత్కాలికంగా యుద్ధవిరమణచేసి " రా బాచిబాబూ నీళ్ళు పట్టుకెళ్ళు" అంటూ అడ్డుతొలగారు.

భాస్కర్ నీళ్ళ కుళాయి దగ్గర్నుంచీ ఆలస్యంగా వెళితే లక్ష్మి చేత దెబ్బలు తినాలని తెలిసి అతని మీద సానుభూతితో తమలో తమకున్న విభేదాలు మరచి ముందు అతన్ని నీళ్ళు పట్టుకోనిచ్చారు వాళ్ళు.

నీళ్ళు పట్టుకొని మోయలేక మోయలేక నీళ్ళ కడవను తీసుకెళ్తున్న భాస్కర్‌వంక జాలిగా చూస్తూ "పాపం తల్లి తండ్రిలేని అనాథ!"

"దిక్కులేక యింటికి వచ్చిన పిల్లాడిచేత అడ్డ వాచాకిరీ చేయిస్తుంది."

"జీతం బత్తెంలేని నౌకర్లాగా చూస్తుంది!"

"జీతం యిస్తేమాత్రం యింతపని ఎవరు చేస్తారు."

"మాడు చెక్కల చద్దన్నం పులిసిపోయిన మజ్జిగ తప్ప వాడి ముఖాన వేడన్నం కూర ఏనాడైనా తగలేస్తుందా

"బ్రహ్మరాక్షసి"!

"ఊరుకో – వింటంటే మనమీద ఉరుములు మెరుపులతో కుంభవృష్టి కురుస్తుంది."

లక్ష్మి వాకిట్లోకి రావడంతో సంభాషణ ఆగిపోయాయి. అప్పటివరకు మాట్లాడుకుంటున్న వాళ్ళు తన రాకతో నిశ్శబ్దంగా వుండడం గమనించిన లక్ష్మి వాళ్ళు అప్పటి వరకు తనను గురించే మాట్లాడుతున్నారని అర్థం చేసుకోవడంతో బాచిగాడిమీద విపరీతమైన కోపం వచ్చింది.

"బాచిగా – పాచివెధవా! పాచివూడ్చి అంట్లు తోమకుండా – వుస్తకం పట్టుకున్నావేంరా?" అని అరిచింది.

"లేదు పిన్నీ – చెల్లాయికి హోంవర్క్ ఎలాచేయాలో చూపిస్తున్నా"

"పొగరుమోతు వెధవా నన్నే ఎదిరిస్తావా– వుండు నీపని చెబుతా "– పరుగెత్తుకువెళ్ళి భాస్కర్ జుట్టుపట్టుకు వీధి వాకిట్లోకి యీడ్చుకొచ్చి అందరూ చూస్తుండగా చెంపలు వాయించింది.

కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే మారు మాట్లాడకుండా నిలబడి పోయాడు భాస్కర్ మౌనంగా పిన్ని పెట్టే హింస భరిస్తూ.

భాస్కర్ సహనం వీధిలో కుళాయి దగ్గరున్న స్త్రీలు ముఖముఖాలు చూసుకోవడం లక్ష్మి కోపాన్ని పెంచాయి.

వాకిట్లోవున్న చెప్పచ్చుకుని చేతులుతీట తీరేవరకు బాది అవతలకువెళ్ళి మంచంమీద పడుకుని "అబ్బో అమ్మో నడుంచిక్కబట్టింది" అంటూ మూల్గసాగింది లక్ష్మి

ఇంటిపని చకచక చేసేసాడు భాస్కర్ లక్ష్మి ఏడ్పులు మిన్నంటాయి.

"ఏమిటి లక్ష్మి-ఏమయింది?" అంటూ వచ్చాడు లక్ష్మి భర్త రామారావు.

"చాకిరీ చేయలేక నడుం పట్టేసింది. ఏమాత్రం కదిలినా తేళ్ళు కుట్టినట్లు ఒకటే నొప్పి. ఈ పూట వంట చేయలేను" మూల్గుతూ అంది.

భార్యవంక నమ్మలేను అన్నట్లు ఎగాదిగా చూచాడు రామారావు.

"అబ్బబ్బో అయ్యయ్యో" తారాస్థాయిలో అరుస్తున్న భార్యను చూచి దడుసుకున్నట్లు వంటగదిలోకి నడిచాడు.

వంట యింట్లోకైతే వెళ్ళాడుగాని అక్కడ ఏంచేయాలో తెలీలేదు రామారావుకు.

"అరే బాచీ ఇలారారా- ఎక్కడేంవుందో నాకు తెలవదు. మీ పిన్ని నడుంనొప్పితో మంచం ఎక్కింది"

భాస్కర్ వంట యింట్లోకి రాగానే సిగరెట్ ముట్టించుకుని బయటకు వెళ్ళిపోయాడు రామారావు

గంట తర్వాత వంటపని పూర్తిచేసి ఇవతలకు వచ్చాడు భాస్కర్.

"బాచి బాబూ" దీనంగా వినపడింది తాత శంకరయ్య పిలుపు

"అరే బాజీ-యీ యింట్లో వూడ గొట్టిన వాగటి దుంపలా పడివున్న నాసంగతి పట్టించుకునే వారెవర్రా! పక్షవాతం వచ్చిన రోజేప్రాణం పోయినా బాగుండేది! మీ నాయనమ్మ పోకముందే నేను పోయినా బాగుండేది! దిక్కులేని బ్రతుకైపోయింది వాది!"

సానుభూతినిండిన కళ్ళతో తాతను చూస్తుండిపోయాడు భాస్కర్

"పోయిన కాలూ చెయ్యి పోగా మంచికాలు చెయ్యి ఒకటేతీవు- యీ బాధ భరించలేన్రా" ఏడుపు మూలుగూ కల్సిన గొంతులోంచి మాటలు పెగలివచ్చాయి.

నెమ్మదిగా తాత కుడిచేయి కాలూ నవరించసాగాడు భాస్కర్

"బాచీ నువ్వు దేవుడివిరా-నీ చేతిలో ఏం మహత్తుందో-నొప్పులు తగ్గాయిరా" కళ్ళనీళ్ళు తిరుగుతుంటే అన్నాడు తాత

"బాచీ అన్నా" వాకిట్లోంచి హరిణి కేకవేసింది.

## పూజ

"నిజంగానీకు 'పూజం'టే అంత ఇదా?

"నిజమే. పూజా బేడీని కొలుస్తాను. పూజా భట్‌నూ కొలుస్తాను"

—పి.వి.రమణకుమార్

వాకిట్లోకి వెళ్ళాడు భాస్కర్

పుస్తకాలతో నిండిన బాగ్‌ను మెడకు తగిలించుకుని ఆ బరువుకు రెండోవైపుకు వంగి"అన్నా కాన్వెంట్ రిక్షా రాలేదు- ఆలస్యంగా వెళ్తే టీచర్ తిడ్తుంది" అంది హరిణి

"అలాగా - సైకిల్ మీద తీసుకువెళ్తాలే" సైకిల్ వెనుక సీటుపై హరిణిని కూర్చోబెట్టుకుని తీసుకువెళ్ళాడు భాస్కర్

కాన్వెంట్‌లో హరిణిని దింపి యింటికి తిరిగి వచ్చిన భాస్కర్, పిన్ని ఉత్సాహంగా పురమాయించిన పనులు చేసేటప్పటికి సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చాడు.

లక్ష్మి పిన్ని సుష్టుగా భోంచేసి డన్‌లప్ పరుపుమీద పడుకుని గుర్రుపెట్టి నిద్రపోయాకగాని భాస్కర్ భోంచేయడానికి వీలుచిక్కలేదు.

తాతకు జావ తాగించిన తర్వాత పుస్తకాలు తెచ్చుకుని తాత మంచం దగ్గర కూర్చుండిపోయాడు భాస్కర్

ఇంత తెలివిగలవాడివి, నిన్ను బడికి వెళ్ళనిస్తే ఫస్ట్ మార్కులు వచ్చేవి. నీ ఖర్మకాలి మీ అమ్మా నాన్న ఏక్సిడెంట్‌లో పోయారు.

తాత మాటతో భాస్కర్ మనసులో అలజడి రేగిందిగాని మరుక్షణంలోనే నిబ్బరపడి " తాత ఇవ్వాళ్ళ ఆల్జీబ్రా చెబుతానన్నావు" అన్నాడు.

"అవున్రా బాచీ"

తాత అల్జీబ్రా చెప్పడం పూర్తయ్యేసరికి పిన్ని సుష్టుగా భోంచేసి ఒకనిద్రతీసిలేచి "రేయ్ బాచిగా!" అని అరువసాగింది.

"పొద్దుద్నుంచీ గుక్కెడు మంచినీళ్ళు కూడా తాగలేదు బజారుకుపోయి బాదంపాలు తీసుకురా" అయిదు రూపాయిల నోటు ఫ్లాస్కు అందిస్తూ అంది

బాదంపాలుతెచ్చి యిచ్చాక బజ్జీలు, బజ్జీలు తెచ్చాక, కిరాణా కొట్లో సరుకులు ఆ తర్వాత కూరగాయలు-పొద్దువాలే వరకు కందిరీగ పరుగెత్తినట్లు తిరుగుతూనే వున్నాడు భాస్కర్ బజార్ల వెంట.

మళ్ళీ సాయంత్రం వంట, ఇంటి పనులు పాపకు పాఠం చెప్పటం-రాత్రి తొమ్మిదింటికిగాని ఊపిరిపీల్చుకోటానికి వీలు కాలేదు భాస్కర్‌కు

పక్కవాటాలో రామం మాస్టారు పిలిస్తే వెళ్ళాడు భాస్కర్

ఇంగ్లీషు సోషల్ పాఠాలు చెప్పాడు రామం మాస్టారు

పిల్లలులేని రామం మాస్టారి భార్య పళ్ళుపాలు యిచ్చి భాస్కర్ ఆకలిబాధను తీర్చింది.

* * * *

'అమ్మా' భయంగా బెదురుతూ పిలిచింది హరిణి

"ఏమిటే? ఏమిటా దుమ్ము వంటినిండా? అమ్మో గౌనునిండా రక్తం ఏమిటీ? ఏమయింది? "గాభరాగా అడిగింది లక్ష్మి కూతురును

బదులుగా బావురుమని ఏడ్చింది హరిణి "ఏమిటే చిట్టితల్లీ - ఏమయిందీ?"

హరిణి ఏడ్పు ఎక్కువయింది.

హరిణి ఏడ్పుచూసి లక్ష్మికి ఏడ్పు ఆగలేదు. కూతురును కౌగలించుకుని తనూ ఏడ్వసాగింది.

రెండు నిముషాలయినాక హరిణి "అమ్మా మరే నేనే బస్సుకింద పడబోయాను-అహ బస్సు నామీదగా పోబోయింది-అప్పుడు బాచీఅన్న నన్ను అవతలకు లాగాడు- అప్పుడే బాచీ అన్ననే బస్సు ఎత్తి అవతలపడేసింది. అన్నకు వళ్ళంతా రక్తం అయింది. చాలామంది జనం వచ్చి అన్నను ఎక్కడికో తీసుకెళ్ళారు" చెప్పడంఆపి వెక్కివెక్కి ఏడ్చింది హరిణి.

"ఓసి అంతేగదా! నీకేం దెబ్బతగల్లేదు గదా! పోన్లే ఆ బాచీగాడుచస్తే పీడావదిలి పోతాడు తిండి దండగ వెధవ!" కూతుర్ననునయించ బోయింది లక్ష్మి

"అమ్మా అయితే బాచీ అన్నయ్య చచ్చిపోతాడా?" భయంతో బెదిరిపోతూ అడిగింది హరిణి

"చస్తే చచ్చాడు శని విరగడవుతుంది.! ఏల్నాటి శని పట్టినట్లు పట్టాడు?" పళ్ళునూరుతూ బదులిచ్చింది లక్ష్మి

"నిజంగా చచ్చిపోతాడా?"

"ఆ చస్తాడు-ఏం చస్తే? భూమికి భారం తగ్గిపోతుంది!" విసుగ్గా బదులిచ్చింది లక్ష్మి

"వద్దు - బాచీ అన్న చచ్చిపోవద్దు" వెక్కుతూ అంది హరిణి

"వాడి సంగతి మనకెందుకుగాని పద స్నానం చేసి మంచి బట్టలు వేసుకుందువుగాని"

"ఊహు నేన్రాను - బాచీ అన్న చచ్చిపోతాడు" కిందబడి దొర్లుతూ ఏడ్వసాగింది హరిణి.

"మంచిగా చెబితే నీక్కాదు? వాడి పేరెత్తావో చంపేస్తా" కూతురు వీపుమీద రెండంటించింది గుడ్లురుముతూ లక్ష్మి

భయంతో బిగుసుకుపోయింది హరిణి. తల్లి మాటలకు హరిణి మనసులో అన్న అంటేవున్న ప్రేమ, సానుభూతి మరింతగా పెరిగాయి. తల్లి



## న్యాయవిచారణ

కళ్ళు అగ్నిగోళాలై విచ్చుకోవడం విషేధం!
కళ్ళెదుటే వూళ్ళన్నీ
చెల్లాచెదురైన మనుషుల ముఖచిత్రాలవుతున్నా
చూపుల్ని నరికేసుకున్నవాడే పౌరుడు!
మాట బాణమై గొంతుని పెగల్చడం విషేధం!
పచ్చి అబద్ధాలే అధికారవార్తలై
ప్రచురింపబడుతున్నప్పుడు, ప్రసారం చేయబడుతున్నప్పుడు
మాటని గుండెలో పాతేసుకున్నవాడే పౌరుడు!
అడుగులు బాటలై సాగిపోవడం విషేధం!
ఒకపాట గొంతు కలుపమని పిలిచినప్పుడు
కదలకుండా అడుగుల్ని ఖండించుకున్నవాడే పౌరుడు!
ఎవడెవడో యిక్కడ బ్రతుకుల్ని
నిర్దేశిస్తున్నప్పుడు, నియంత్రిస్తున్నప్పుడు
బ్రతుకూ తనదికాదనుకున్నవాడే పౌరుడు!
చూపు విషేధం... మాట విషేధం
బతుకుబాట మీదపూసే పాట విషేధం!
అన్నింటినీ నిషేధించినవాళ్ళు
హక్కుల మీద న్యాయవిచారణ జరిపిస్తారు.
రెక్కల్ని కత్తిరించి, దారుల్ని దిగ్బంధించి
ఎగిరొచ్చి, పీఠం ముందు మాట్లాడే
స్వేచ్ఛనిచ్చామంటూ ప్రకటిస్తారు.
ప్రణాళిక పకడ్బందీగానే అమలవుతుంది
ఒక నమ్మకం, ఒక ఆశ... మళ్ళీ మళ్ళీ మరణిస్తాయి
చివరికి-
మనిషితనం మండి అలీనమైపోయినవాళ్ళు
అంతా సజావుగానే వుందంటూ వివరణలిస్తారు!
** ** ** ** ** **
మీరూ, మీతో కలసి
రాజ్యాంగవేదిక మీద వేసే ప్రదర్శన
ఎల్లప్పుడూ విజయవంతమే...
మూడు సింహాల సాక్షిగా-!

–కోడూరి విజయకుమార్

ప్రవర్తనపట్ల కోపం, అసహ్యం, తల్లిఅంటే ద్వేషం పెరిగింది ఆ పసి మనసులో ఒక్కసారిగా

"రా స్నానం చేద్దూగాని"

"ఉహు నేన్రాను – నువ్వు మంచిదానివి గాదు – ఎప్పుడూ అన్నను తిడతావు!" కోపంతో అరిచింది హరిణి

"వేలెడులేవు – గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందని నన్నే ఎదిరిస్తావా? నీకు నాకంటే ఆ ముష్టివెధ వెక్కువా?" చెంపలు వాయించి రెక్కబట్టుకుని యీడ్చుకువెళ్ళి స్నానం చేయించింది.

కోపం, భయం, అసహ్యంతో బిగుసుకుపోయిన హరిణి మాట్లాడలేదు. కాని తల్లి యిచ్చిన పాలు తాగలేదు – అన్నం తినలేదు చేష్టలుడిగిన బొమ్మలాగా వుండిపోయింది హరిణి

"లక్ష్మీ–బాచీకి ఏక్సిడెంటయిందట, ప్రమాదంగా వుందని రామం మాస్టారన్నారు– రా వెళ్దాం ఆస్పత్రికి" ఆదుర్దాగా యింట్లోకివస్తూ అన్నాడు రామారావు

"నేన్రాను – నాకింకా యింట్లోపనికాలా" మంచంమీదనుంచి లేవకుండా సమాధానం చెప్పింది లక్ష్మి

క్షణం భార్యవంక చూచాడు రామారావు, ఆమెతో ఏం మాట్లాడీ ఉపయోగంలేదని అనుభవ పూర్వకంగా తెలుసుగనుక మాట్లాడకుండా వెళ్ళిపోయాడు బయటకు. తండ్రివెంటే పరుగెత్తుకు వెళ్ళింది హరిణి.

భర్త, కూతురు వెళ్ళడం గమనించిన లక్ష్మి నెమ్మదిగా మంచంమీదనుంచి లేచివెళ్ళి భోంచేసి వచ్చి పడుకుంది. మాగన్నుగా నిద్రపోయిన లక్ష్మి ఉలికిపడిలేచింది. గోడ గడియారంవంక చూచింది.

"పదిన్నరయినా తండ్రీ కూతురు యింటికి రాలేదు. బజారు తలుపులు తెరిచే వున్నాయిగాబోలు" మంచం మీంచి లేవబోయింది లక్ష్మి. వెనుక వసారాలో మాటలు వినిపించి ఆగిపోయింది.

"బాచి ఎలావున్నాడమ్మా?" మామ మాట వినపడింది.

"తలకు బాగా దెబ్బతగిలింది బాబాయి. విపరీతంగా రక్తం పోయింది. సుబ్బారావుగారి అబ్బాయి రక్తం యిచ్చాడు– ఎక్కిస్తున్నారు."

"డాక్టరుగారేమ్మన్నారు..?"

"రెండు రోజులు గడవాలి–స్పృహరావాలి అన్నారు."

"ఎంత ఘోరం జరిగింది! దిక్కులేని పక్షిలా నిక్కృష్టజీవనం గడుపుతున్నాడే! ఇంకా దురదృష్టం వాడివెంటబడి వేధించాలా?"

"బాబాయి–బాచీ దిక్కులేనివాడని అనుకోకు– బజారు బజారు మొత్తం ఆస్పత్రిలో బాచీబాబు మంచం చుట్టూవున్నారు. జనాన్ని అదిలించలేక నర్సులు హైరానా పడిపోతున్నారు."

"నిజంగానా అమ్మా"

"అవును బాబాయి"

"ఒక సూర్యుడు సమస్త జీవులకు అన్నట్లు బాచీ యీ బజారులో ప్రతిఒక్కళ్ళకీ తలలో నాలుకలా మసలుకునేవాడు–ఎవరికేం అవసరం వచ్చినా వెళ్లి సాయపడేవాడు. ఆస్తిపాస్తులు లేకపోతేనేం? వాడికున్నంత గొప్ప మనసు ఎవరికుంటుంది?

"అవును బాబాయి–భయపడకు చెల్లీ అంటూ కలవరిస్తున్నాడు! వాడి మనసునిండా చెల్లెలు నిండిపోయివుంది! చావు బతుకులమధ్య కొట్టుమిట్టాడుతూ కూడా చెల్లెలి సంగతే కలవరిస్తున్నాడు"

"నా ప్రాణంపోయి వాడు బతికితే ఎంత బాగుండును!" దుఃఖంతో మామ గొంతు పూడుకుపోవడం విన్నది లక్ష్మి

"ఊరుకో బాబాయి బాచీకేంగాదు ధైర్యంగా వుండు"

"ఎలా ధైర్యంగా వుండేది? తాతా తాతా అంటూ నామంచం చుట్టూ తిరిగేవాడు! కళ్ళల్లో మెదుల్తున్నాడు. అమ్మాయి– మా రామారావు హరిణీ అక్కడే వున్నారా?"

"వున్నారు హరిణి అన్న మంచం దగ్గర కూర్చుని ఒకటే ఏడుస్తూంది బాబాయి"

"పాపం దానికి వాళ్ళన్నంటే పంచప్రాణాలూ"

ఇక వినలేకపోయింది లక్ష్మి. కళ్ళముందు కట్టిన తెరలు విడిపోయినట్లయిందామెకు. ఇన్నాళ్ళు అనాథ అని అసహ్యించుకున్న భాస్కర్ తనకు యీరోజు పుత్రీభిక్ష పెట్టాడు! ప్రాణాలకు తెగించి వాడు హరిణిని కాపాడకపోతే జీవితమంతా కూతుర్ని తలచుకుని కుమిలిపోతూ ఏడ్వాల్సి వచ్చేది!

లక్ష్మికి ఒక్క ఉదటున దుఃఖం పెల్లుబికింది! "నా బాచీ బాబుకేం కాగూడదు!" అని మనసులో అనుకుంటూ ఆస్పత్రివైపుకు పరుగెత్తింది.